# జైహింద్

## –పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**ప్రతిసారీ** కోహిమా నుండి రేడియో సందేశం వెళ్తున్నప్పుడల్లా దానిని ఛేదించే పనిలో కోహిమాలో ఉన్న బ్రిటిషు సైనికులు నిమగ్నమవటం, ఫెయిలవటం జరుగుతూనే ఉంది. దానికి కారణం వారు సందేశం ఖచ్చితంగా ఎక్కడ నుండి వెళ్తుందో ట్రేస్ చేయక ముందే రేడియో ఆఫ్ అవటం. సందేశం పంపటంలో అచింత్ వేగం వల్ల అది సాధ్యం అవుతోంది.

ఇప్పుడు కూడా డోల్మా సందేశం పంపటం మొదలు పెట్టగానే కోహిమాలోని కౌంటర్ ఇంటెలిజెన్స్ ఆఫీసులో హడావుడి మొదలయింది. అయితే ఎప్పటిలా ఈసారి సందేశం వేగంగా ముగిసి పోలేదు. దానికి కారణం డోల్మా అనుభవ లేమి.

ప్రస్తుతం డోల్మాతో పాటు కాంచనమాల, మధుబాల ఒక చిన్న గుట్ట మీద కూర్చుని ఉన్నారు. అక్కడ నుండి నాలుగు వేపుల ఉన్న పరిసరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమె అచింత్ అంత వేగంగా మోర్స్ కోడ్ పంపలేక పోతోంది. పైగా సగం సందేశం పంపాక ట్రాన్స్‌మిషన్ బటన్ ఆన్ చేయలేదని చూసుకుంది. దాంతో తిరిగి మొదటి నుంచి మొదలు పెట్టాల్సి వచ్చింది.

అప్పటికే కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాలు సందేశం ఎక్కడ నుండి వస్తుందో కనిపెట్టారు. వారి అదృష్టం కొద్దీ, ఆ ప్రదేశానికి దగ్గరలోనే మిలటరీ యూనిట్ ఒకటి ఉంది. వారికి సందేశం వస్తున్న ప్రదేశం గురించి చెప్పారు.

ఇంకా సందేశం సగం కూడా పంపక ముందే బ్రిటిషు సైనికులు గుట్టని చుట్టుముట్టారు.

గుట్ట మీద ఉన్న ముగ్గురికీ పైకి వస్తున్న సైనికులు స్పష్టంగా కనపడుతున్నారు.

"మీరు వెళ్ళిపోండి. ఒక్క పని కోసం ముగ్గురి ప్రాణాలు ప్రమాదంలో పెట్టటం వృధా..." అంది డోల్మా.

"నిన్ను ఒంటరిగా విడిచి మేము ఎక్కడకీ వెళ్లం..." అన్నారు వారు.

“మీరు వెళ్లకపోతే నేను సందేశం పంపను.” చేస్తున్న పని ఆపుతూ అంది డోల్మా.

“వద్దు. మన ప్రాణాల కంటే సందేశం పంపటం ముఖ్యం…” చెప్పింది మధుబాల.

“అయితే నన్ను ఒంటరిగా వదిలి మీరు వెళ్లిపోండి…” అంది డోల్మా.

తన రివాల్వర్లు తీసి చేతిలో పట్టుకుని, “మేము వెళ్లటం కాదు, వచ్చే వాళ్ళను ఆపుతాం. నువు నీ పని కొనసాగించు…” అని కాంచనమాల ఒక పక్కకు వెళ్ళి గుట్ట మీదకు వస్తున్న సైనికుల మీద కాల్పులు మొదలు పెట్టింది. మధుబాల మరో వైపు నుండి అదే పని చేస్తోంది.

పై నుండి కాల్పుల శబ్దం వినిపించటంతో సైనికులు కూడా కాల్పులు మొదలు పెట్టారు. ఇరు వైపులా కాల్పులు జరుగుతున్నాయి. అయితే వీరి వద్ద ఉన్నది రెండు రివాల్వర్లు, కొన్ని అదనపు బుల్లెట్లు. అవి ఎంతో సేపు సైనికులను నిరోధించలేక పోయాయి.

ఆఖరి బుల్లెట్ కూడా పేల్చిన కాంచనమాల ఇక చేయగలిగింది ఏమీ లేక నిస్పృహగా ఆకాశం వైపు చూస్తూ ఉండి పోయింది.

పై నుండి కాల్పులు తగ్గటంతో సైనికులు తిరిగి గుట్ట పైకి ఎక్కటం మొదలు పెట్టారు.

కాంచనమాల, మధుబాల తమ ప్రాణాల మీద ఆశలు వదిలేసుకుని ప్రాణం పోవటానికి ఎదురు చూస్తున్నారు.

ఇంతలో ఆకాశంలో దూరంగా చిన్న నలకలా కనిపించింది ఒక విమానం కాంచనమాలకు. చూస్తుండగానే అది పెద్దదయి విమానం అని అర్ధమయింది. దాని వెనుక మరిన్ని విమానాలు కనిపించాయి.

ఒక విమానం అతి తక్కువ ఎత్తులో కాంచనమాల తల మీదగా ఎగురుకుంటూ పోయింది. దాని మీద ఉన్న గుర్తులను బట్టి అది జపాను యుద్ధ విమానం అని అర్ధమయింది.

ఆ విమానాల నుండి వరుసగా బాంబులు పడుతున్నాయి.

హఠాత్తుగా గుట్ట ఎక్కుతున్న సైనికులు తాము చేస్తున్న పని ఆపారు. శత్రువుతో తలపడటానికి వెంటనే స్థావరాలకు రమ్మని వారికి సందేశాలు వచ్చాయి. వారు వెను తిరిగారు.

ఒక్కసారిగా ప్రశాంతత ఆవరించటంతో, “పని అయ్యిందా…” అంటూ డోల్మా ఉన్న వైపుకు వెళ్లారు వీళ్ళు.

డోల్మా రేడియో మీద పడిపోయి ఉంది. సైనికులు పేల్చిన ఒక బుల్లెట్ ఆమె మెడలో నుండి దూసుకు పోయింది.

“డోల్మా…” అని పెద్దగా కేక పెట్టి కూలబడి పోయింది మధుబాల.

కాంచనమాల డోల్మా శరీరాన్ని దూరంగా జరిపి పరీక్షగా రేడియోని చూసింది.

“ఇంతకీ మన సందేశం హెడ్‌క్వార్టర్‌కి చేరిందా?” అడిగింది మధుబాల.

"తెలియదు…" అంది కాంచనమాల. "ఏది ఏమయినా ఇక దాని ప్రాధాన్యత ఏముంది? జపాను దాడి మొదలయింది. ఆజాద్ హింద్ ఫౌజు కూడా వచ్చేసి ఉంటుంది. మనం చేయగలిగింది చేశాం. ఇక జరగాల్సింది జరుగుతుంది…" అంది.

ప్రస్తుతం…

"ఇప్పుడు చెప్పండి మేడం. ఆ సందేశం ఆజాద్ హింద్ ఫౌజుకు చేరిందా, చేరలేదా?" ఆత్రుతగా అడిగాదు మయాంక్.

"ఆ విషయం అప్పుడూ తెలియదు. ఇప్పుడు తెలిసే అవకాశమూ లేదు…" అంది కాంచనమాల.

వారిద్దరు ఢిల్లీ లోని ఎర్రకోట దగ్గర ఉన్నారు.

"తరువాత ఏం జరిగింది మేడం? యుద్ధంలో ఎవరు గెలిచారు?"

"రెండవ ప్రపంచ యుద్ధాన్ని మలుపు తిప్పిన అతి పెద్ద యుద్ధాలలో ఒకటి స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం అయితే, రెండవది ఇంఫాల్, కోహిమా యుద్ధం…"

"అంత పెద్ద యుద్ధం భారతదేశ విముక్తి కోసం జరుగుతుంటే, మిగిలిన పార్టీలు, ఇతర రాజకీయ నాయకులు ఏం చేశారు?"

"అప్పుడు దేశంలో ప్రజలకు అసలు ఇలాంటి యుద్ధం ఒకటి జరుగుతోంది అని కూడా తెలియకుండా కప్పుబుచ్చారు బ్రిటిషు వాళ్ళు. అప్పటి రోజుల్లో ప్రజలకు వార్తలు చేరవేసేది వార్తా పత్రికలు మాత్రమే. వాటి మీద సెన్సార్‌షిప్ విధించి తాము కోరుకున్న వార్తలను మాత్రమే ప్రచురింపనిచ్చే వాళ్ళు. పైగా ఆనాడు ఉన్న సమాచార వ్యవస్థలో… ప్రభుత్వం చెప్పకపోతే, ఎక్కడో మారుమూల ఇంఫాల్, కోహిమాలలో జరుగుతున్న యుద్ధం గురించి ప్రజలకు తెలిసే అవకాశమే లేదు."

"మరి యుద్ధంలో ఏం జరిగింది మేడం?"

"ముందు ఆజాద్ హింద్ ఫౌజు మంచి విజయాన్నే స్వంతం చేసుకుంది. ఇంఫాల్, కోహిమాలలో కొంత భాగాన్ని అదుపులో పెట్టుకుంది. రెండు పట్టణాలను కలిపే రోడ్డును పూర్తిగా స్వాధీనం చేసుకుంది. ఇక విజయం నామమాత్రమే అనుకున్న దశలో వానలు మొదలయ్యాయి. ఒకసారి వానలు మొదలు కాగానే కలుగుల్లో ఉన్న ఎలుకల్లా బ్రిటిషు సైనికులు తమ స్థావరాల నుండి బయటకు వచ్చారు. బెంగాలు ప్రజలను మాడ్చి మరీ పోగు చేసిన ఆహార పదార్థాలు సైనికుల కోసం విమానాల ద్వారా సరఫరా చేశారు బ్రిటిషు వాళ్లు. క్రమక్రమంగా బ్రిటిషు సైనికుల సంఖ్య పెరిగింది. అయినా… మూడు నెలల పాటు ఆజాద్ హింద్ ఫౌజు బ్రిటిషు సైన్యాన్ని ఎదిరించి నిలిచింది. నెమ్మదిగా ఆజాద్ హింద్ ఫౌజు వనరులు తరిగిపోయాయి. మందుగుండు, ఆహారం సరఫరా కాలేదు. అడవుల్లోని దారులన్నీ వానల కారణంగా

మూసుకు పోయాయి. సంఖ్యా బలంలో మూడు రెట్లు ఉన్న జపాను, ఆజాద్ హింద్ ఫౌజు ఉమ్మడి సైన్యం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. వెనక్కి తగ్గినా బర్మాకు పోవటానికి దారి లేదు. ఆకలితో మలమల మాడుతూ, అంటు వ్యాధులతో పోరాడుతూ 65000 మంది సైనికులు మరణించారు. బ్రిటిషు వారి తరుపున కూడా 20000 మంది వరకు మరణించారు. మొత్తానికి మరొకసారి బ్రిటిషు సైనికుల వ్యూహం ఫలించింది. జపాను సైన్యాన్ని, ఆజాద్ హింద్ ఫౌజు సైన్యాన్ని తిప్పి కొట్టటంలో సఫలీకృతులయ్యారు."

"మరి ఆజాద్ హింద్ ఫౌజు సైనికుల పరిస్థితి ఏమయింది?"

"చనిపోయిన వారు చనిపోగా మిగిలిన వారిలో కొందరు బందీలుగా పట్టుబడ్డారు. మరి కొందరు తిరిగి బర్మా చేరుకున్నారు. అయితే జరిగిన నష్టం సామాన్యమయినది కాదు. సైన్యాన్ని తిరిగి కూడగట్టుకోవటానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నెమ్మది నెమ్మదిగా బర్మా కూడా బ్రిటిషు వారికి వశమయి పోయింది. 1945, ఏప్రిల్ 24న మిగిలిన సైన్యంతో బర్మా నుండి బోస్ బాంగ్‌కాక్ బయలుదేరాడు. ఇరవై కిలోల బ్యాగులు వీపుకు కట్టుకుని నడుస్తున్న సైనికులను చూసి, తను కారులో ప్రయాణం చేయటానికి నిరాకరించి తను కూడా వారితో నడక మొదలు పెట్టాడు బోసు. ఇరవై రోజులు సాగిన ఆ ప్రయాణంలో కాళ్లు బొబ్బలు ఎక్కినా, శరీరం సహకరించక పోయినా ఆయన కారు మాత్రం ఎక్కలేదు. అదీ ఆయన నిబద్ధత..."

"పాంచ్ పటాకాలో మీరు, మధుబాల గారు మాత్రం మిగిలారు కదా. మరి మీకు ఎలాంటి పరిస్థితి ఎదురయింది?"

"మేమిద్దరం అదే రోజు బందీలుగా పట్టుబడ్డాం. మమ్మల్ని అరెస్ట్ చేసి ఢిల్లీ పంపారు. ఈ ఎర్రకోటలోనే మమ్మల్ని బంధించారు..." ఎదురుగా ఉన్న ఒక సెల్ చూపించి చెప్పింది కాంచనమాల, "ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే ఇదే ఆ గది." ఎర్రకోటలో ఎదురుగా ఉన్న ఒక గదిని చూపిస్తూ చెప్పింది ఆమె.

"మధుబాల గారు కూడా మీతో ఇక్కడే ఉన్నారుగా?"

అవునన్నట్లు తల ఆడించింది కాంచనమాల. "మా మీదే కాదు, ఆజాద్ హింద్ ఫౌజు తరుపున పోరాడిన వేలాది మంది మీద కేసులు పెట్టారు. ఈ కోటలోనే విచారణ చేశారు. దానికి గానూ ప్రత్యేక కోర్టులు పెట్టారు... షానవాజ్ ఖాన్, ప్రేమ్ సెహగల్, గురుబక్ష్ సింగ్ ధిల్లాన్ లాంటి యుద్ధ వీరుల మీద దేశద్రోహ నేరం మోపి విచారణ చేశారు."

"దేశం కోసం పోరాడితే దేశద్రోహ నేరమా?"

"ఆజాద్ హింద్ ఫౌజు సైనికుల మీద దేశద్రోహ నేరం మోపటాన్ని మధుబాల తట్టుకోలేక పోయింది. స్వాతంత్రం వచ్చిన తరువాత వారిని ఏ శిక్షా లేకుండా విడిచి పెట్టినా, వారి వీరత్వానికి గుర్తుగా ఒక్క పతకమూ లభించలేదు. వారెవరికీ మామూలు సైనికులకు లభించే పెన్షన్ సౌకర్యం కూడా కలగలేదు. అవన్నీ చూసిన ఆమె నా దగ్గర ఒక మాట తీసుకుంది. "ప్రాణాలకు తెగించి మనం చేసిన పోరాటాన్ని మన దేశం గుర్తించలేదు. మన ప్రజలు గుర్తించలేదు.

అలాంటపుడు మనం మాత్రం ఎందుకు చెప్పుకోవాలి? ఈరోజు నుండి నా గతం గురించి నేను మరచిపోతాను. నువు కూడా నా గురించి ఎవరికీ చెప్పకు...” అని ఆమె నన్ను అడిగింది. “అంత ఆవేశం ఎందుకు, రోజులు మారతాయి మధూ...” అన్నాను నేను. “నువ్వు ఆశించిన రోజు రావాలంటే మనం వందేళ్ళు బ్రతకాలేమో...” అంది తను. “ఏమో బ్రతుకుతామేమో?” అన్నాను నేను. “అలా మనలో ఎవరన్నా వందేళ్ళు బ్రతికితే, రోజులు మారుతున్నాయని అనిపిస్తే... అప్పుడు మన విషయాలు చెప్పినా నాకు అభ్యంతరం లేదు. అప్పటివరకు మాత్రం మన కథని ఇలా అజ్ఞాతంలో ఉండి పోనీ...” అంది మధుబాల. అందుకే మన ప్రధానమంత్రి గారికి ఆయన తల్లి గురించిన గతం తెలియదు.”

“ఇప్పుడు ఆమె గతం తెలియటమే కాదు, ఆమెను బంధించిన సెల్ కూడా తెలిసిపోయింది. ప్రధానమంత్రి తల్లి గారు ఉన్న చెరశాల అంటే ఈ కోట ప్రాముఖ్యం మరింత పెరిగి పోతుంది.” అన్నాడతను. “ఎక్కడో దేశానికి ఏశాన్యాన అడవుల్లో జరిగిన యుద్ధం ఎవరుఇకీ తెలియలేదంటే అర్థం చేసుకోగలను. కానీ, ఢిల్లీ నడి బొడ్డున ఆజాద్ హింద్ సైన్యం మీద ఇన్ని అరాచకాలు జరుగుతుంటే ప్రజలకు తెలియకుండా ఎలా ఉంది?”

“తెలియకుండా లేదు మయాంక్. తెలిసింది. రాజకీయ నాయకులు, దేశభక్తులుగా కీర్తింపబడేవారు ఏమన్నా, అనకపోయినా... బ్రిటిషు ప్రభుత్వాన్ని బెంబేలెత్తిస్తూ బ్రిటిషు సైన్యంలోనే తిరుగుబాటు వచ్చింది. 1857 సిపాయి తిరుగుబాటు గురించి అందరికీ తెలుసు. కానీ 1946 సిపాయి తిరుగుబాటు గురించి అతి కొద్ది మందికే తెలుసు. ఎర్రకోటలో దేశం కోసం పోరాడిన సైనికుల మీద దేశద్రోహం కేసు పెట్టారని తెలుసుకున్న ఆయుధదళాలు తిరుగుబాటు ప్రకటించాయి. 1946, జనవరి నెలలో 2000 మంది ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది సమ్మెకు పూనుకున్నారు. అలహాబాద్‌లో మొదలయిన సమ్మె... కరాచీ, కలకత్తా, విశాఖపట్టణాలకు పాకింది. ఇంతలో 78 యుద్ధ నౌకల్లో పనిచేస్తున్న 20000 మంది నావికులు బొంబాయి కేంద్రంగా తిరుగుబాటు చేశారు. బ్రిటిషు జెండాను అవనతం చేసి భారత జెండాను తమ నౌకల మీద ఎగురవేశారు. బ్రిటిషు అధికారులను తరిమి కొట్టి నేతాజీ చిత్రపటాలను చేతిలో పట్టుకుని బొంబాయి నగరంలో ఊరేగింపు చేశారు. ‘జై హింద్’, ‘ఢిల్లీ చలో’ నినాదాలతో బొంబాయి మారుమోగింది. 1946 చివరకు తిరుగుబాటు ఆర్మీకి కూడా విస్తరించటంతో బ్రిటిషు వారికి మనకు స్వాతంత్రం ఇవ్వటం తప్ప మరో మార్గం లేకపోయింది.”

“ఇలా తిరుగుబాటుకు వారిని ప్రేరేపించింది ఎవరు మేడం? ఈ తిరుగుబాటుకు ఎవరు నాయకత్వం వహించారు?” అడిగాడు మయాంక్.

“సుభాస్ చంద్ర బోస్...”

“కానీ ఆయన అప్పటికే చనిపోయారు కదా?”

“ఆయన లేకపోతేనేం ఆయన ఫొటో పెట్టి పోరాటం చేశారు. ఆయన తప్ప వారికి మరో నాయకుడు లేడు. తను ఉన్నా లేకున్నా ఇన్ని వేల మంది సైనికులను ఉత్తేజ పరచగలిగిన సుభాస్ చంద్ర బోస్ గొప్పతనం అది. ఇంకొక మాట ఆయన అప్పటికే చనిపోయారని నీకు ఎవరు చెప్పారు?”

“అదేంటి మేడం అన్ని పుస్తకాల్లో అదే రాసి ఉంటుందిగా. 1945 ఆగస్టు 18 న విమాన ప్రమాదంలో ఆయన చనిపోయారని…”

“ఈ ప్రపంచంలో ఎనిమిదో వింత అంటూ ఏదన్నా ఉందంటే అది ఆయన చావే…” కన్నీళ్లు తుడుచుకుంటూ అంది కాంచనమాల.

“దాని గురించి కూడా చెప్పండి మేడం…” అన్నాడు మయాంక్.

1945, ఆగస్టు 15…

“ఢిల్లీ వెళ్లే రోడ్డు ఒకటే ఉండదు. ఒక రోడ్డులో వెళ్లాం. అడ్డంకులు ఎదురయ్యాయి. అలా అని ఆగిపోము. ఈ ప్రపంచంలోని ఏ శక్తీ భారతదేశాన్ని బంధించి ఉంచలేదు. అతి త్వరలో మన దేశానికి స్వాతంత్రం రాబోతోంది…”

ఇవీ సుభాస్ చంద్ర బోస్ అధికారికంగా మాట్లాడిన ఆఖరి మాటలు. ఇండియన్ నేషనల్ ఆర్మీ డే సందర్భంగా రాత పూర్వకంగా బాంకాక్ నుండి ఇచ్చిన సందేశం.

మరుసటి రోజు అంటే 1945, ఆగస్టు 16 న జపాను ప్రపంచ యుద్ధంలో తన లొంగుబాటును ప్రకటించింది. అంటే జపాను సైన్యంతో పాటు వారితో కలిసి పోరాడిన సుభాస్ చంద్ర బోస్ కూడా యుద్ధ ఖైదీగా పరిగణింపబడతాడు. అది బోసుకు ససేమిరా ఇష్టం లేదు.

వెంటనే బోస్ వెళ్ళి జపాను ఫీల్డ్ మార్షల్ టరౌచీని కలిశాడు. తనను ఎలా అయినా సోవియట్ యూనియన్ చేర్చమని అడిగాడు. భావి భారత స్వాతంత్ర పోరాటాన్ని సోవియట్ యూనియన్ సహకారంతో చేయాలన్నది బోసు ఆకాంక్ష.

బోసును అప్పచెప్పమని బ్రిటిషు ప్రభుత్వం ఇవాళో, రేపో అడగక పోదు. యుద్ధంలో ఓడిపోయి, లొంగిపోయిన జపానుకు మరో దారి ఉండదు. అప్పుడు బ్రిటిషు ప్రభుత్వం బోసుకు మరణశిక్ష విధించటం తథ్యం. అందుకే ఫీల్డ్ మార్షల్ టరౌచీ మిట్సుబిషి 97-2 రెండు ఇంజిన్ల బాంబర్‌ను బోసు కోసం రెడీ చేశాడు. వారంట్ ఆఫీసర్ అయోగీ దానికి పైలెట్. మేజర్ సకురో తకిజావా కో-పైలెట్. షిరో ననగాకీ విమానానికి కెప్టెన్. 1945 ఆగస్టు 17 సాయంత్రం అయిదు గంటలకు విమానం గాల్లోకి లేచింది. రెండు గంటల తరువాత సైగాన్‌కి హనోయికి మధ్య ఉన్న టౌరానే అనే ప్రదేశంలో ల్యాండ్ అయింది. విమానం అప్పటికే ఒక టన్ను వరకు ఓవర్‌లోడ్ అయి ఉంది. అందుకని రాత్రి ప్రయాణం వద్దనుకున్నారు. ఆ రాత్రి అక్కడ విశ్రాంతి తీసుకుని మరుసటి రోజు ఉదయం 5 గంటలకు బయలుదేరి మధ్యాహ్నానికి

తైపేలోని సింగ్‌షన్ ఎయిర్‌ఫీల్డ్‌లో ఆగారు. అక్కడ నుండి మరో ఆరు గంటలు ప్రయాణిస్తే మంచూరియా చేరతారు. అందుకుగానూ అదనంగా మూడు పీపాల ఇంధనాన్ని కూడా విమానంలోకి ఎక్కించుకున్నారు. విమానంలో సిబ్బంది కాక 13 మంది ఉన్నారు. సుభాస్ చంద్ర బోసుతో పాటు కలనల్ హబీబుర్ రెహమాన్ ఉన్నాడు. వారిద్దరే భారతీయులు. మధ్యాహ్నం రెండు గంటలకు విమానం బయలుదేరింది. గాల్లోకి లేస్తుండగానే ఒక వైపుకు ఒరిగి రెక్క నేలకు తగిలింది. అంతే!... విమానం కింద పడి రెండు ముక్కలయింది. ఒక్కసారిగా మంటలు విమానాన్ని చుట్టుముట్టాయి. విమానం లోపల ఉన్న ఒక ఇంధనం ట్యాంకు పగిలి ఆ ఇంధనం బోసు మీద పడింది. క్షణంలో వెయ్యో వంతులో మంటలు బోసును చుట్టుముట్టాయి. అయినప్పటికి బోసు తన అనుచరుడితో సహా విమానం నుండి బయటపడ్డారు. నిమిషాల్లో ఆయనను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్లేటప్పటికే బోసు కోమాలో ఉన్నారు. కొన్ని గంటల్లోనే ఆయన కాలిన గాయాల కారణంగా చనిపోయారు...

ఇదీ బోసు మరణం గురించి బ్రిటిషు ప్రభుత్వం అధీకృతంగా విడుదల చేసిన సమాచారం. ఇంతే కాదు ఆ తరువాత ఏం జరిగిందో కూడా వారే వివరంగా చెప్పారు.

...1945 ఆగస్టు 23 న జపాను రేడియో సుభాస్ చంద్ర బోసు మరణ వార్తని ధ్రువీకరించింది. ఆయన అస్తికలు సెప్టెంబరు 7 న టోక్యో చేరుకున్నాయి. రెంకోజీ ఆలయంలోని రెవరెండ్ మొచుజుకి వాటిని ఆలయంలో భద్రపరిచారు. సెప్టెంబరు 14 న సంస్మరణ సభ జరిగింది. బోసు తగలబడిపోతూ కూడా, 'ఇండియాకు స్వాతంత్రం రావటానికి ఇంకెంతో సమయం పట్టదు...' అంటూ మరణించాడని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు.

అయితే గాయపడిన బోసును గానీ, మరణించిన బోసును గానీ ఎవరూ ఒక్క ఫొటో కూడా తియ్యలేదు. డెత్ సర్టిఫికెట్ జారీ చెయ్యలేదు. అయితే బోసుతో పాటే ఉన్న కలనల్ హబిబుర్ రెహమాన్ చిన్నపాటి గాయాలతో బయట పడ్డాడు.

దీని మీద భారతీయులకు ఎన్నో అనుమానాలు ఉన్నాయి. 1941 లోనే బోసును చంపమని ఆజ్ఞాపించిన చర్చిల్ ఇప్పుడు ఆయన్ని చంపించాడని, దానికి భారతీయ రాజకీయ నాయకుల్లో కొంత మంది సహకరించారని... ఎన్నో అనుమానాలు రేగాయి. ఆఖరికి మహాత్మా గాంధీ కూడా ముందు బోసు మరణ వార్తని నమ్మలేదు. బోసుతో ప్రయాణించిన హబిబుర్ రెహమాన్‌ని కలుసుకున్న తరువాత మాత్రమే బోసు మరణాన్ని అంగీకరించారు.

బోసు మరణించాడని ప్రజలే కాదు, ఆజాద్ హింద్ ఫౌజ్ కూడా నమ్మలేదు. ఎందుకంటే బోసు ఇలా అజ్ఞాతంలోకి వెళ్లటం ఇది మొదటిసారి కాదు. ఎప్పటిలానే అందరినీ మరోసారి ఆశ్చర్యపరుస్తూ బోసు తిరిగి వస్తాడని అందరు నమ్మారు. ఎన్నెన్నో పుకార్లు పుట్టుకు వచ్చాయి. భారతదేశానికి స్వాతంత్రం రావటంతో ఆయన ఆశయాలు మరింత విస్తృతం అయ్యాయని, విశ్వశాంతి కోసం హిమాలయాల్లో తపస్సు చేస్తున్నాడని కొందరు ప్రచారం చేశారు. బోసు చైనాలో ఉన్నాడని, మహాత్మా గాంధీ చనిపోయినపుడు వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నాడని అన్నారు. సోవియట్ ప్రెసిడెంట్ నికితా

క్రుశ్చెవ్ ఇండియా వచ్చినపుడు విలేకరులతో పిచ్చాపాటీ మాట్లాడుతూ, నెహ్రూ కోరుకుంటే 45 రోజుల్లో బోసును మీ ముందుకు తెస్తాను అన్నాడన్న పుకార్లు పుట్టాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో గుమ్‌నామీ బాబాగా ప్రసిద్ధుడయిన ఒక యోగి మరెవరో కాదు సుభాస్ చంద్ర బోస్ అని అన్నారు.

ఈ పుకార్లకు అంతం పలకటానికి భారత ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది. 1956 లో షానవాజ్ కమిటీని వేసింది. షానవాజ్ మరెవరో కాదు… ఆజాద్ హింద్ ఫౌజ్‌లో జనరల్‌గా పనిచేసిన వ్యక్తి. కమిటీ మొత్తం 67 మంది సాక్షులను విచారించింది. వారిలో విమాన ప్రమాదం నుండి బయట పడ్డ వారు ఉన్నారు. ముఖ్యంగా బోసు అనుచరుడు ప్రస్తుతం పాకిస్తాన్ నివాసి హబిబుర్ రెహమాన్‌ని, బోసుకు ఆఖరి నిమిషాల్లో వైద్యం అందించిన డాక్టర్ యోషిమీని కూడా విచారించింది. ఎట్టకేలకు బోసు విమాన ప్రమాదంలో మరణించిన మాట వాస్తవమే అని తేల్చింది. కమిటీ సభ్యులందరు జవహర్‌లాల్ నెహ్రూ, బెంగాల్ చీఫ్ మినిస్టర్ బి.సి. రాయ్ ఒత్తిడికి లొంగిపోయారని ఆరోపిస్తూ… ఈ కమిటీలోనే ఒక సభ్యుడయిన సురేష్ చంద్ర బోస్ కమిటీ రిపోర్‌ట్ మీద సంతకం పెట్టటానికి నిరాకరించాడు. సురేష్ చంద్ర బోస్ స్వయానా సుభాస్ చంద్ర బోస్ సోదరుడు కావటంతో మరోసారి అందరు అయోమయంలో పడిపోయారు.

1970 లో భారత ప్రభుత్వం పంజాబ్ హైకోర్‌ట్ రిటైర్‌డ్ చీఫ్ జస్టిస్ ఖోస్లాని సింగిల్ మెంబర్ కమిటీగా అసలు ఏం జరిగిందో చెప్పమని నియమించింది. నాలుగు సంవత్సరాలు శ్రమించిన ఖోస్లా ప్రత్యేకంగా ఏదీ చెప్పలేదు. దాదాపుగా షానవాజ్ కమిటీ చెప్పిన విషయాలతో ఏకీభవించాడు.

1999 లో సుప్రీం కోర్టు రిటైర్‌డ్ జడ్జ్ మనోజ్ కుమార్ ముఖర్జీ అధ్యక్షతన మరో కమిటీని భారత ప్రభుత్వం నియమించింది. కమిటీ 6 సంవత్సరాలు పరిశోధించింది. జపాన్, రష్యా, తైవాన్ దేశాలలో పర్యటించింది. వారి రిపోర్‌ట్ ప్రకారం విమాన ప్రమాదం నిజంగా జరిగిందనటానికి ఎలాంటి ఆధారాలు లేవు. రెంకోజీ ఆలయంలో సుభాస్ చంద్రబోస్‌వి అని చెప్పబడుతున్న అస్తికలు ఆయనవి కావు. ఒక జపాను సైనికుడివి. అదే సమయంలో డి.ఎన్.ఎ. టెస్ట్ ఆధారంగా గుమ్‌నామీ బాబా సుభాస్ చంద్ర బోస్ కాదని కూడా తేల్చింది. సుభాస్ చంద్ర బోసు ఉనికి తెలిస్తే ఆయనను కూడా యుద్ధ ఖైదీగా భావించే ప్రమాదం ఉంది కాబట్టి, జపాను ప్రభుత్వం విమాన ప్రమాదం డ్రామా ఆడి ఉంటుందని కూడా కమీషన్ అభిప్రాయ పడింది.

2006 మే 17 న ఈ రిపోర్టు పార్లమెంటు ముందుకు వచ్చింది. ఈ నివేదికలో లోపాలున్నాయని పేర్కొంటూ దీనిని పరిగణనలోకి తీసుకోవటానికి పార్లమెంటు నిరాకరించింది.

కాబట్టి, ఇప్పటికీ సుభాస్ చంద్ర బోసు మరణం గురించి ఎవరికి తోచింది వారు మాట్లాడుతూనే ఉన్నారు…

కాంచనమాల చెప్తున్న విషయాలను జాగ్రత్తగా నోట్ చేసుకుంటున్నాడు మయాంక్. ఆఖరుగా తల ఎత్తి, “ఇంతకీ నిజం ఏమిటంటారు?” అన్నాడు.

"తెలియదు. నిజానికి ఇప్పుడు ఆ విషయానికి అంత ప్రాముఖ్యం కూడా లేదు. ఆయన బ్రతికి ఉంటే ఇప్పటికి 123 సంవత్సరాలు ఉండాలి. సుభాస్ చంద్ర బోస్‌కి అయినా అది సాధ్యం కాదని నేను భావిస్తున్నాను. ఈ ప్రపంచంలో ఎప్పటికీ గుట్టు వీడని రహస్యాలు కొన్ని ఉంటాయి. సుభాస్ చంద్ర బోస్ మరణం కూడా అందులో ఒకటి అనుకో..." అంది కాంచనమాల.

సంవత్సరం తరువాత...

'జై హింద్' పుస్తక ఆవిష్కరణ సభ జరుగుతోంది.

ప్రధానమంత్రి స్వయంగా పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ ఉండటంతో ఆ సభకు ఎక్కడ లేని ప్రచారం లభించింది.

కాంచనమాల ఆ సభకు రావటానికి ముందు ఆసక్తి చూపలేదు. కానీ, ప్రధానమంత్రి బలవంతంతో వచ్చి వేదిక మీద కూర్చుని ఉంది.

మధుబాలతో పాటు చేవా, డోల్మా, ఫ్లోరెన్స్ చిత్రపటాలు వేదిక మీద పెట్టి ఉన్నాయి.

కాంచనమాల పక్కన కూర్చుని ఉన్న మయాంక్, "మేడమ్! మీరు ఎదురు చూసిన రోజులు వచ్చాయి. మీలాంటి ఎంతో మంది అజ్ఞాత స్వాతంత్ర పోరాట వీరులను దేశం గుర్తించ బోతోంది..." అన్నాడు.

ఇంతలో ప్రధానమంత్రి వచ్చాడు.

పుస్తకాన్ని ఆవిష్కరించి తన ఉపన్యాసం ఇవ్వటానికి పోడియం దగ్గరకు నడిచాడు.

అందరితో పాటు ఒక కాపీ అందుకున్న కాంచనమాల అట్ట మీద కనిపిస్తున్న 'పాంచ్ పటాకా' చిత్రాలను చూసి, "అవును. ఇప్పటికయినా గుర్తింపు వస్తోంది..." అనుకుంది.

(సమాప్తం)

COMMENTS